# మాండూక్యోపనిషత్తు

(అధర్వణ వేదం)


వ్యాఖ్యాత :

'అభినవ వ్యాస' 'జ్ఞానప్రపూర్ణ'

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు**

B.Sc., (Ag)



ఆధ్యాత్మిక జ్ఞానపీఠం – చిలకలూరిపేట

# పూజ్య గురుదేవులు



'అభినవ వ్యాస' 'జ్ఞానప్రపూర్ణ'

## శ్రీ దేవిశెట్టి చలపతిరావు

B.Sc., (Ag)

వ్యవస్థాపకులు :

ఆధ్యాత్మిక జ్ఞానపీఠం – చిలకలూరిపేట

# మాండూక్యోపనిషత్తు

## ఉపోద్ఘాతం

### 1. ఉపనిషత్తు ఎందుకు?

ఈ ప్రపంచం పంచవిషయాలతో కూడుకున్నది. అవే శబ్ద స్పర్శ రూప రస గంధ అనే విషయాలు, మనసు పంచ ఇంద్రియాల సహాయంతో పని చేస్తుంది. అవే శ్రోత్ర, త్వక్, చక్షు, రసన, ఘ్రాణ = చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు. శబ్దాన్ని వినటానికి శ్రోత్రం; స్పర్శను తెలుసుకోవటానికి త్వక్, రూపాన్ని చూడటానికి చక్షు, రుచి చూడటానికి రసన, వాసన చూడటానికి ఘ్రాణ.

మన ఎదురుగా ప్రపంచం ఉంది. మన లోపల దాన్ని తెలుసుకొనే మనస్సు ఉంది. – ఈ ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి, కాని మనిషిలో మాత్రం మనస్సు ఒక్కటే ఉంది.

మరి ఆ మనస్సులో ఏమున్నాయి? ఎన్నో **ఆలోచనలు.**

అందరి మనస్సులలో ఆలోచనలుంటాయి. అయితే అందరి ఆలోచనలు ఒక రకం కాదు. ఎవరి ఆలోచనలు వారివే – అసలు ఆలోచనలు ఎందుకు కదులుతుంటాయి? చెట్ల ఆకులు ఎందుకు కదులుతుంటాయి అంటే ఏం చెబుతాం? గాలి వీయటం వల్ల అంటాం. మరి ఆలోచనలు కదలటానికి కారణం? ఆశలు – కోరికలు అనే గాలి వల్ల. కోరికలున్నంతకాలం మనిషి ప్రశాంతంగా ఉండలేడు.

ఆకలి దప్పికలున్నంత వరకు మనిషి ప్రశాంతంగా ఉండగలడా? లేదు. అవి తీరితేనే శాంతి. ఎలా తీరుతాయి?

అన్నం తింటే ఆకలి తీరుతుంది. నీరు త్రాగితే దప్పిక తీరుతుంది. ఆకలి – దప్పిక తీరితేనే శాంతి.

అలాగే కోరికలు తీరితేనే శాంతి. – ఎలా తీరుతాయి? కోరికలు తీరాలంటే కర్మలు చేయాలి. ఐతే కర్మలు చేసి కోరికలను తీర్చుకున్నంత మాత్రాన శాంతి కలుగుతుందా? లేదు. ఎందువల్ల? కోరికలు అనంతం. ఒకదాని తర్వాత ఒకటి కలుగుతూనే ఉంటాయి. మరి ఏమిటి పరిష్కారం? అసలు కోరికలు కదలకుండా ఉంటే సరి. అసలు కోరికలు కదలటానికి కారణం ఏమిటి? అది మనస్సు యొక్క స్వభావం. అందుకే కదులుతున్నాయి.

కోరికలు కదలకుండా ఉండే స్థితి కూడా మనస్సుకు ఉన్నదా? ఉన్నది. అందుకే కదులుతున్నాయి కూడా.

నిశ్చలంగా ఉన్న నీటిలో రాయి విసిరితే అలలు కదులుతాయి. నిశ్చలంగా ఉన్న మనస్సులో విషయవస్తువులనే రాళ్ళను విసిరితే కోరికలు కదులుతాయి. అంటే మనస్సుకు చలించని స్థితీ ఉంది, చలించే స్థితీ ఉంది. ఆకులు కదిలే స్థితీ ఉంది, కదలని స్థితీ ఉంది. అలాగే ఆలోచనలు కదిలే స్థితీ ఉంది, కదలని స్థితీ ఉంది. ఆ కదలని స్థితియే నిశ్చల స్థితి. అదే నిస్సంకల్ప స్థితి. నిర్వికల్ప స్థితి. మనస్సు చలిస్తే అశాంతి, చలించకపోతే ప్రశాంతి. మనిషికి కావలసింది ప్రశాంతియే అశాంతి కాదు. అంటే

**మనస్సు చలించని స్థితియే కావాలి. అదే జీవిత లక్ష్యం కావాలి. దానినే జీవితంలో సాధించాలి.**

ఐతే మనస్సు చలించకుండా ఉండే స్థితిని సాధించుట చాలా చాలా చాలా కష్టం. కారణం? మనిషికి ఎన్నో ఆశలు, కోరికలు. వాటివల్లనే ఆలోచనలు – కొన్ని తీరుతుంటాయి. కొన్ని తీరవు. తీరితే తాత్కాలిక సుఖం – శాంతి. తీరకపోతే అశాంతి, నిరాశ, నిస్పృహ. అసలు కోరికలే దుఃఖానికి కారణమా? బౌద్ధులు అలాగే అంటారు. కాని హిందూ ధర్మం – సనాతన ధర్మం అలా అనదు. జంతువులకు కోరికలుండవు. కాని దుః ఖాలున్నాయి. కనుక కోరికలే దుఃఖానికి కారణం అని చెప్పే వీలులేదు.

కనుక మనిషి అలా కోరికలు లేకుండా ఉండాలనికాదు. మనిషికి కోరికలు ఉండాలి. అసలు ఏ కోరికా లేని వాడికి మోక్షం కావాలనే కోరిక కూడా కలగదు.

కోరికలే పురోభివృద్ధికి కారణమని అర్థశాస్త్రం చెబుతుంది. కనుక కోరికలుండటం వరమే కాని శాపం కాదు.

మరి కోరికలు వరమే అయితే దుఃఖాన్నెందుకు కలిగిస్తాయి? కోరిక తీరకపోవటం వల్ల అని అనుకుంటాం. కాని జాగ్రత్తగా ఆలోచిస్తే కోరిక తీరినా దుఃఖమే, తీరకపోయినా దుఃఖమే. చూడండి ఒకడికి పెళ్ళి చేసుకోవాలని కోరిక. ఆ కోరిక తీరటం లేదు. కనుక పెళ్ళి కాలేదని దుఃఖిస్తాడు. అయింది. సంతోషం. అయింతర్వాత భార్య మాట వినటం లేదని దుఃఖిస్తాడు. లేదా పిల్లలు లేరని దుఃఖిస్తాడు. కలిగారు, సంతోషం. పిల్లలు కలిగిన తర్వాత కూడా దుఃఖిస్తాడు. ఎందుకు? చెప్పినమాట వినటం లేదని. భార్యాభర్తలు కలిసి ఉండటం ఒకడికి దుఃఖం. ప్రతి రోజూగోల. విడిపోయారు. విడిపోయినందుకు ఇప్పుడు దుఃఖం. ఎందుకు? ఒంటరితనం భరించలేక. ఇల్లు లేదని దుఃఖము, కట్టించిన తర్వాత సౌకర్యాలు లేవని దుఃఖము. ఎదురిల్లు బాగుందని దుఃఖము, అసంతృప్తి. కనుక ఈ అసంతృప్తి పోవాలి – సంతృప్తి కలగాలి, శాంతి కలగాలి, ప్రశాంతత కావాలి. ఎవరిస్తారు శాంతిని? ప్రశాంతతను?

ప్రభుత్వం సప్లై చేస్తుందా? – అదే అశాంతితో అలమటిస్తుంది. ఎన్నికల ముందు ప్రకటించిన వరాలు నేరవేర్చలేక, పెట్టిన ఆశలు తీర్చలేక అదే సతమతమవుతుంది. అపోజిషన్ వాళ్ళ విమర్శలతోనో, అవినీతి పనులు బయటపడితేనో దానికీ అశాంతే. పోనీ ప్రక్కయింటివాళ్ళు ఎదురింటి వాళ్ళు ఇస్తారా? వారు మాత్రం శాంతితో ఉన్నారా? సంతృప్తితో ఉన్నారా? లేదు – ఈ లోకంలో దుఃఖం లేకుండా ఎవరుంటారు? ఎక్కడ ఉంటారు?

ఒక స్త్రీ తన బిడ్డ చనిపోయాడని దుఃఖంతో గౌతమబుద్ధుని వద్దకు వచ్చింది. ఎలాగైనా బ్రతికించమని అడిగింది. – సరే – ఎవరినైనా అడిగి కొంచం ఆవాలు తెమ్మన్నాడు. ఐతే ఒకమాట అడుగు. "మీ ఇంట్లో ఎవరూ చనిపోలేదా? మీకు ఏ దుఃఖము లేదా?" అని. అలాగే అడిగింది అందరిని. అందరూ దుఃఖాల్లో ఉన్నవారే అని తెలుసుకుంది.

మరి సంతృప్తిని – సంతోషాన్ని ఎవరిస్తారు? ఎవరు? ఎవరు? శాంతి కావాలంటే ప్రశాంతత కావాలంటే – నిత్య సుఖం కావాలంటే – జ్ఞానం కావాలి. ఆత్మజ్ఞానం కావాలి. ఆత్మజ్ఞానం ఎక్కడుంది? – **ఉపనిషత్తులలో ఉంది.** ఐతే ఉపనిషత్తులు నిత్యసుఖాన్ని – శాంతిని – ప్రశాంతతను తెచ్చి ఇస్తాయా?

నిత్యసుఖాన్ని ఎక్కణ్ణించో తెచ్చి ఇస్తే అది మళ్ళీ పొయ్యే అవకాశం ఉంది. మరి ఎక్కడుంది నిత్యసుఖం?

నీవు తప్ప మరొకటి లేని చోట ఉంది. నీలోనే ఉంది.

ఆఁ! నిజంగా నాలో ఉన్నదా? అవును. అది గాఢనిద్రలో ఋజువౌతున్నది. గాఢ నిద్రలో ఎవరున్నారు? నేను మాత్రమే – నీవు మాత్రమే.

నీవు గాక ఇంకేమున్నాయి? ఏమీ లేవు. అందుకే సుఖం – హాయి – ఆనందం – ప్రశాంతత. అంటే సుఖం నీలోనే ఉన్నది. అది బయట లేదు. అసలు అది నీవే. తత్ త్వం అసి – **తత్త్వమసి**.

మరి నేనే సుఖస్వరూపానినైతే, సుఖం కోసం నేను వెంపర్లాడటం ఎందుకు? నాకు ఉపనిషత్తులెందుకు? నేను సుఖాన్నే గదా!. నేను సుఖస్వరూపమే అయినా ఆ విషయం నాకు తెలియదు. మరచిపొయ్యా. కనుక ఎవరో చెప్పాలి. గుర్తు చెయ్యాలి; ఎవరు చెప్పాలి? ఎవరు గుర్తు చెయ్యాలి?

అలా చెప్పేవి – గుర్తు చేసేవే ఉపనిషత్తులు.

సరే ఉపనిషత్తులు చదివితే నేను సుఖస్వరూపాన్ని అని తెలుస్తుందా? దానితో సుఖం – నిత్య సుఖం వస్తుందా? అలా అయితే ఉపనిషత్తులను ప్రింట్ చేసిన వాడికి నిత్యసుఖం రావాలి గదా!

వాటిని రోజూ బట్టీపట్టే వారికి రావాలి గదా!. అలా రావటంలేదే – మరి ఉపనిషత్తుల వల్ల జ్ఞానం, జ్ఞానం వల్ల సుఖం – శాంతి ఎలా వస్తాయి?

గురుబోధ ద్వారానే జ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానాన్ని స్వంతం చేసుకుంటేనే నీవు సుఖ స్వరూపానివయి ప్రశాంతతను పొందుతావు. సముద్రంలో నీరుంది. కాని దప్పిక తీరదు. అది వర్షరూపంలో వస్తేనే దప్పిక తీరుతుంది. అలాగే ఉపనిషత్తులలో జ్ఞానం ఉంది. కాని అది నీకు శాంతినివ్వదు. గురుబోధ ద్వారా గ్రహిస్తేనే శాంతి.

గురుబోధవల్ల నీవు సుఖస్వరూపానివి అవుతావా? అలా అయితే ఇప్పుడు నీవు సుఖస్వరూపానివి కాదనేగా! మరి నీవు ఇప్పుడు కూడా సుఖస్వరూపానివే అయితే గురుబోధ ఎందుకు?

నీవు సుఖస్వరూపం అయ్యే ఉన్నావు అని తెలియజెప్పటానికే – తెలుసుకోవటానికే గురుబోధ. అంటే గురుబోధ వల్ల నీవు సుఖ స్వరూపానివని గుర్తు తెచ్చుకుంటావు. అంతే –

**నీ స్వరూపాన్ని నీవు తెలుసుకోవటమే మోక్షం.** కనుక మోక్షం అనేది సిద్ధవస్తువే గాని సాధ్యవస్తువు కాదు. లేని వస్తువును ప్రయత్నించి సాధించుకోవాలి. ఉన్నదానికి ప్రయత్నం అక్కరలేదు. ఉన్నదని తెలుసుకుంటే చాలు.

పూర్వకాలంలో ఇంటిపెద్ద ఇనప్పెట్టె తాళం చెవి మొలత్రాడులో కట్టుకుంటాడు. చేతితో తడిమి చూస్తే కనిపించలేదు. పోయింది పోయింది అన్నాడు. అంతటా వెతికాడు. కాని కనిపించలేదు. స్నానం చేసేటప్పుడు సబ్బురుద్దుకుంటుంటే చేతికి తగిలింది. దొరికింది – దొరికింది అన్నాడు. అది నిజంగా పోలేదు, దొరకలేదు. అది అక్కడ ఎప్పుడూ ఉన్నదే. ఉన్నదని గ్రహిస్తే చాలు. అలాగే మోక్షం ఉన్నదే – సిద్ధవస్తువే – తెలుసుకుంటే చాలు. మోక్షాన్ని పొందే పని లేదు. నేను మోక్ష స్వరూపుణ్ణి అనే విషయాన్ని

మరచావు. కారణం? అజ్ఞానం. కనుక అజ్ఞానాన్ని తొలగించుకుంటే సరి. **అజ్ఞానం అంటే** అగ్రహణం – అన్యధాగ్రహణం రెండూ.

1. నేను ఆత్మను అని తెలియకపోవటం అగ్రహణం.
2. నేను జీవుణ్ణి అని అనుకోవటం అన్యధాగ్రహణం. ఈ రెండూ కలసి అజ్ఞానం. ఇది తొలగితే మోక్షమే. కనుక మోక్షం స్వయంసిద్ధం.

నేను ఆత్మను అని తెలిస్తే బాధ లేదు. ఆనందమే. (తురీయం).

తెలియకపోయినా బాధ లేదు (గాఢనిద్ర). కాని నేను దేహాన్ని అని అనుకుంటేనే బాధ. ఇదే అధ్యాస (అది కాని దానిని అది అనుకోవటమే అధ్యాస). అధ్యాస నివారణార్థం న శాస్త్రపఠనం. వస్తు నిర్ధారణార్థం శాస్త్రం. పామును తొలగించటానికి శాస్త్రం అక్కరలేదు. త్రాడు త్రాడుగా తెలియటానికే శాస్త్రం – ఉపనిషత్తు.

అద్దంలో ముఖం కనబడుతుంది. ఉపనిషత్తుల్లో మన స్వరూపం కనబడుతుంది. అందుకే ఉపనిషత్తును తెలుసుకోవాలి. అదీ గురుబోధ ద్వారా తెలుసుకోవాలి. అందుకే "వేదాంతశాస్త్రే ఆత్మ దర్శనం" అన్నారు. వేదాంతశాస్త్రం అంటే ఉపనిషత్తే –

ఉపనిషత్తులు ఆత్మసాక్షాత్కారం కొరకే –

మానవుడు మాధవుడేనని, నరుడు నారాయణుడేనని, జీవుడు దేవుడేనని తెలియజెప్పటమే కాదు, ఆ స్థాయిని కల్పించుటకు తగిన జ్ఞానాన్ని ప్రసాదించేది ఉపనిషత్తులే. మానవుడు తరించటానికి కావలసిన సమస్త విషయాలను తెలియజెప్పేవి ఉపనిషత్తులే.

ఆత్మానుభూతిని పొందటానికి మనకు ఎలాంటి జ్ఞానం కావాలో ఆ అద్భుతమైన జ్ఞానాన్ని తనలో దాచుకున్న జ్ఞానభాండాగారాలే ఉపనిషత్తులు. ఒక్కమాటలో చెప్పాలంటే మానవునికి సర్వస్వం ఉపనిషత్తులే. ఇదీ ఉపనిషత్తుల అవసరం.

## 2. ఉపనిషత్తులు ఎక్కణ్ణించి వచ్చాయి?

ఉపనిషత్తులన్నీ వేదాలలోనివే. మొదట్లో వేదమంత్రాలన్నీ కుప్పలు తెప్పలుగా ఒక్కటిగానే ఉండేవి. కృత - త్రేతాయుగాలలో మానవుని ఆయుర్దాయం వేలసంవత్సరాలలో ఉండేది. కనుక వారు వేదమంత్రాలను తెలుసుకొని వారి జీవితాలను సార్థకం చేసుకొనేవారు.

అయితే ద్వాపరయుగం వచ్చేనాటికి మానవుని ఆయుర్దాయం వందల సంవత్సరాలలోకి వచ్చింది. ద్వాపరయుగం చివరలో వ్యాసుడు జన్మించేనాటికి ఆనాటి మానవుల ఆయుర్దాయం 200 సం॥లే. అనంతముగా ఉన్న ఈ వేదమంత్రాల జోలికి ఆనాటి మానవులు గాని, రాబోయే కలియుగంలోని మానవులుగాని పోలేరని భావించిన వ్యాసుడు ఈ వేదమంత్రాలన్నింటిని 4 భాగాలుగా విభాగించి వేదవ్యాసుడయ్యాడు. అవే ఋగ్వేదం - యుజుర్వేదం - సామవేదం - అధర్వణవేదం.

1. సృష్టికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ఉన్నది ఋగ్వేదం. దీనికి అధిష్ఠానదేవత బ్రహ్మ.
2. స్థితికి - పోషణకు సంబంధించిన విషయాలు ప్రధానంగా ఉన్నది యజుర్వేదం. దీనికి అధిష్ఠానదేవత విష్ణువు.
3. లయవిషయాలు ప్రధానంగా ఉన్నది సామవేదం. ఇందులో నృత్యం, నాట్యం, సంగీతం, లలితకళలు మొ॥నవి ఎన్నో విద్యలున్నాయి. దీనికి అధిష్ఠానదేవత శివుడు.
4. మార్పులు లేని నిరాకార నిర్గుణ పరమాత్మకు సంబంధించిన విషయాలు ప్రధానంగా ఉన్నది అధర్వణవేదం. దీనికి అధిష్ఠానదేవత అధర్వుడు (పరమాత్మ).

మళ్ళీ ప్రతి వేదంలోను 4 భాగాలున్నాయి.

1. **సంహిత - (మంత్రభాగం) :** ఇందులో ప్రకృతిశక్తుల ఆరాధన,

స్తోత్రపాఠాలు, పంచభూతాల యొక్క శక్తిసామర్థ్యాలను వర్ణించటం – అనేవాటితో నిండి ఉంటుంది ఈ మంత్రభాగం. ఆనాటి మానవులు ప్రకృతి శక్తులను – ముఖ్యంగా పంచభూతాలను, సూర్యచంద్రులను గ్రహించి, వాటి యందుండే భగవత్‌శక్తిని – కరుణ, దయ క్షమాదిగుణాలనే గాక వాటిలోని అతీతమైన ఉగ్రశక్తిని కూడా కనుగొన్నారు, ఆరాధించారు.

**2. బ్రాహ్మణములు :** తమ తమ కోర్కెలను ఈడేర్చుకొనుటకు దేవతలను ప్రసన్నం చేసుకొని, వారి అనుగ్రహాన్ని పొందాలని ఆనాటి వారు భావించేవారు. అందుకు అవసరమైన పూజాదికాలు, నోములు, వ్రతాలు, యజ్ఞయాగాదులు మొ॥ కర్మకాండను ఎలా నిర్వహించాలో, ఆయా విధానాలను పొందుపరచారు ఈ బ్రాహ్మణాలలో.

**3. ఆరణ్యకాలు :** నిరాకార నిర్గుణ పరమాత్మను – తమదేహంలో ఉన్న పరమాత్మను ఉపాసించే విధానాలను జపధ్యానాది సాధనలను తెలియజేసిన భాగమే ఈ ఆరణ్యకాలు.

**4. ఉపనిషత్తులు :** జీవుడు దేవుడేనని తెలిపేజ్ఞానం అంతా ఈ ఉపనిషత్తులలో నిక్షిప్తం చేయబడింది. నామ రూపాత్మకమైన ఈ జగత్తు సత్యం కాదని, ఇది మిధ్యయని; దీనికి ఆధారము, అధిష్టానము అయినది పరమాత్మేయని; అలాగే జీవుడి యొక్క యదార్థ స్వరూపం కూడా పరమాత్మేయని తెలియజేయుటకు తగిన సమాచారం – జ్ఞానం అంతా నిక్షిప్తం చేయబడిన భాగం ఈ ఉపనిషత్తులే.

ఈ ఉపనిషత్తులనే వేదాంతం అంటారు. ఎందుకంటే వేదాలకు అంతంలో ఉన్న భాగం ఉనిషత్తులు కనుక వీటిని వేదాంతం (వేద+అంతం) అన్నారు. ఇవి వేదాలకు శిరస్సులనదగినవి. మోక్షార్థులైనవారికి ఈ ఉపనిషత్తులు భగవత్ ప్రసాదం. ఇవి తెలియని వారికి మోక్షప్రాప్తి లేనే లేదు.

ఈ 4 భాగాల నుండి ఏం గ్రహించాలి? భగవంతుడు ఎక్కడో ఉన్నాడనుకొనే వారికి సంహిత. కాదు, నీ ఎదురుగానే ఉన్నాడని చెప్పేందుకు

బ్రాహ్మణాలు. నీ ఎదురుగా కాదు, నీలోనే ఉన్నాడని చెప్పుటకే ఆరణ్యకాలు. నీలో ఉండటం కాదు, నీవే ఆ పరమాత్మవు అని చెప్పటానికి ఉపనిషత్తులు. ఇలా భగవంతుడంటె తెలియని వారికి 'నీవే ఆది' అని చెప్పేందుకే ఈ 4 భాగాలు.

ఈ మొత్తంలో ఉపనిషత్తులే పరిపూర్ణ జ్ఞానాన్ని అందించేవి. ముక్తిని, మోక్షాన్ని, కైవల్యాన్ని ప్రసాదించే జ్ఞానభాండాగారాలే ఈ ఉపనిషత్తులు.

ఇలాంటి అద్భుతజ్ఞానాన్ని అందించే ఉపనిషత్తులు నాలుగు వేదాలలోను కలిపి 21+109+1000+50 = 1180 ఉన్నాయని పెద్దలు చెబుతారు. అయితే వాటన్నింటి పేర్లు కూడా ఇప్పుడు ఎవ్వరికీ తెలియదు. ఎందుకంటే ఇప్పుడు వేదాలన్నీ పూర్తిగా లభించటం లేదు గనుక.

మొత్తం మీద పండితులు పరిశోధనలు చేసి దాదాపు 350-360 ఉపనిషత్తుల పేర్లను మాత్రం కనుగొనటం జరిగింది. ఇందులో 125 ఉపనిషత్తులు ప్రాచీనమైనవని అంగీకరిస్తున్నారు. ఇవన్నీ తాళ పత్రాలలో ఉండటం వల్ల కొంతవరకు శిథిలమై పోయాయి. అయితే 108 ఉపనిషత్తుల పేర్లు, వాటి శాంతిమంత్రాలు, ఆ ఉపనిషత్తులకు మూలమైన వేదాలపేర్లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. దీనికి కారణం 108 ఉపనిషత్తులలోను చివరిదైన ముక్తికోపనిషత్తులో గురువైన శ్రీరాముడు శిష్యుడైన ఆంజనేయునికి చేసిన బోధయే.

శ్రీరామచంద్రుడు సోదరులతోను, మునీశ్వరులతోను సభదీరి యుండగా ఆంజనేయుడు శ్రీరాముని సేవించి, భక్తితో – "స్వామీ! జీవన్ముక్తి కొరకు ఆత్మజ్ఞానాన్ని బోధించి నన్ను అనుగ్రహించండి" అని అర్థించగా

**శ్రీరాముడు :** ఆంజనేయా! నీవడిగిన నా అసలు స్వరూపము ఉపనిషత్తుల యందు మాత్రమే ప్రామాణికంగా వివరింపబడి యున్నది. (వేదాంతేసుప్రతిష్ఠోఽహం)

"కనుక తగిన గురువుల సహకారంతో ఆ ఉపనిషత్తులనే ఆశ్రయించు" – అన్నాడు. అప్పుడు

**ఆంజనేయుడు :** వేదాంతాః కే రఘు శ్రేష్ఠా!?

రఘుశ్రేష్ఠా ఆ ఉపనిషత్తులేవి? – అని ప్రశ్నించగా 108 ఉపనిషత్తుల పేర్లను 11 శ్లోకాలలో తెలియజేశాడు. అలాగే ఆ ఉపనిషత్తుల శాంతి మంత్రాలను, ఏ ఉపనిషత్తు ఏ వేదంలోనిది? అనే విషయాలను కూడా తెలియజేయటం జరిగింది.

ఇలా 108 ఉపనిషత్తులు ముక్తికోపనిషత్తు కారణంగా ప్రచారంలో ఉన్నవి.

ఈ 108 ఉపనిషత్తులలోను మొదటి 10 ఉపనిషత్తులు దశోపనిషత్తులను పేర బహుళ ప్రచారంలో ఉన్నవి. అవి ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు.

ఈ దశోపనిషత్తులు ఇంతగా ప్రచారంలో ఉండటానికి కారణం వీటికి శంకరాచార్యులు – రామానుజాచార్యులు – మధ్వాచార్యులు – ముగ్గురు ఆచార్యులు భాష్యాలు వ్రాయటమే. వీటిని ముఖ్యమైన ఉపనిషత్తులుగా ముగ్గురు ఆచార్యులు గుర్తించారు. ఎందుకు?

అన్ని ఉపనిషత్తులలోని భావాలు, సిద్ధాంతాలు ఈ దశోపనిషత్తులలో సమగ్రంగా లభిస్తాయని భాష్యకారుల నిర్ణయం.

## 3. ఉపనిషత్ అంటే?

ఇక ఉపనిషత్ అనే పదం మన చెవిన పడటంతోనే ఒక సుందరమైన, మనస్సుకు ఆహ్లాదకరమైన ఒక అద్భుత దృశ్యం మన మనోఫలకం మీద కదలాడుతుంది. ఏమిటా దృశ్యం?

ప్రశాంతమైన ఒక వనవాటిక, అందులో ఒక ఆశ్రమం. ఫలపుష్పాలతో

పచ్చని చెట్లు. ఆ చెట్లపై కిలకిలారావాలు చేస్తున్న పక్షులు. తూర్పుదిక్కున సూర్యుడు సప్తాశ్వములు పూన్చిన రథంపై కూర్చుని వస్తున్న సూచనలు. చల్లని వాతావరణం, చక్కని దృశ్యాలు, వీనులకు విందైన శబ్దాలు. ఆ వనవాటిక మధ్యన ఒక పెద్ద రావిచెట్టు; దాని మొదలు వద్ద ఒక అరుగు, ఆ అరుగుపై శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు, కరుణాసముద్రుడు, ప్రశాంతవదనుడు ఐన సద్గురువు ఆశీనుడై ఉన్నాడు.

ఆయనకు ఎదురుగా సమీపంలో శుభ్రం చేసిన నేలపై దర్భాసనాలు వేసుకొని సాధన చతుష్టయ సంపన్నులైన శిష్యులు ఎంతో భక్తి శ్రద్ధలతో – వినయవిధేయతలతో గురుదేవుల అమృత వాక్కుల కొరకై చకోరపక్షుల్లా ఎదురుచూస్తూ నిశ్శబ్దంగా కూర్చొని ఉన్నారు.

గురుదేవులు గొంతు సవరించుకొని, గంభీరస్వరంతో శిష్యులతో కలసి గురుస్తోత్రం చేసి, శాంతిపాఠాన్ని పఠించి, తత్త్వబోధ చేస్తున్నారు. ఇదీ ఆ దృశ్యం.

"ఉపనిషత్" అనే పదంలో ఈ దృశ్యం ఎక్కడ దాగి ఉన్నది?

**1. ఉపనిషత్ అనే పదంలో**

**'ఉప'** అంటే సమీపంగా

**'ని'** అంటే క్రింద

**'షత్'** అంటే కూర్చొనుట.

ఉపనిషత్ అంటే సమీపంగా క్రింద కూర్చొనుట. ఎవరికి సమీపంగా – ఎవరు కూర్చోవాలి?

గురుదేవునికి సమీపంగా శిష్యుడు క్రింద కూర్చొని ఈ బ్రహ్మజ్ఞానాన్ని పొందాలి – అని అర్థం.

ఈ అర్థాన్ని ఉన్నది ఉన్నట్టు స్వీకరించకూడదు. ఈ పదాల వెనుక దాగి ఉన్న అంతరార్థాన్ని గ్రహించాలి.

**(i)** గురువుకు దగ్గరగా అంటే కొలుచుకొని 1 మీటరు దూరంలో కూర్చోవాలి అని గాని, లేదా ఇంకా దగ్గరగా ఒక అడుగుదూరంలో కూర్చోవాలని గాని అర్థం కాదు. గురువు యొక్క మనస్సులోని భావాలకు దగ్గరగా ఉండాలి. ఆ భావాలకు అనుగుణంగా ప్రవర్తించాలి, జీవించాలి – అని అర్థం. ఇదే సమీపం అంటే.

**(ii)** ఇక క్రింద అంటే ఖచ్చితంగా నేలమీదనే కూర్చోవాలి. ఒకవేళ ఆరోగ్యరీత్యా కూర్చోలేకపోయినా, ఎంతబాధనైనా అనుభవిస్తూ క్రింద కూర్చోవాలి – అని అర్థం కాదు. మరి?

నీ శరీరం కాదు క్రిందుగా ఉండాల్సింది, నీ భావాలు. ఏమిటవి?

(a) గురువు తెలిసినవాడు, నేను తెలుసుకోవలసినవాణ్ణి – అని;

(b) గురువుపట్ల గౌరవం, వినయం, విధేయత, నమ్రత ఉండాలి – అని;

(c) గంగ పై నుండి క్రిందికి ప్రవహించినట్లు జ్ఞానగంగ ఉన్నతుడైన గురువు యొక్క ముఖం నుండి నామస్తకంలోకి ప్రవేశించాలి అని;

(d) అందుకోసం మన తల గురువు యొక్క పాదాల వద్ద ఉండాలి అని భావించాలి. ఎంత గొప్పజ్ఞానాన్ని సంపాదించినా గురువుతో సమానుడను అని భావించరాదు. అహంకారికి ఆధ్యాత్మికరంగంలో పతనం తప్పదు.

**(iii)** ఇక 'కూర్చొనుట' అంటే శాస్త్రాన్ని కూర్చొని మాత్రమే వినాలి. ఇంద్రియ మనోబుద్ధులకు అందని ఆత్మతత్త్వాన్ని స్థిమితంగా గురు సమ్ముఖంలో కూర్చొని మాత్రమే వినాలి. అటూ ఇటూ తిరుగుతూనో, ఏదో పని చేసుకుంటూనో వినేదికాదు బ్రహ్మవిద్య. అందుకే కూర్చొని వినాలి.

2. 'ఉపనిషత్' అంటే మరొక అర్థం ఉంది.

బ్రహ్మమునకు (పరమాత్మకు) సమీపంగా మనలను ఉంచగలిగే జ్ఞానాన్ని కలిగి ఉన్నది గనుక ఈ వేదాంతాన్ని ఉపనిషత్ అన్నారు.

3. అలాగే బ్రహ్మమును తెలియజేసి, బ్రహ్మసాక్షాత్కారానికి సహాయ పడే జ్ఞానం గనుక ఈ బ్రహ్మజ్ఞానాన్ని ఉపనిషత్ అన్నారు.

4. ఉపని+షత్ – సంసారానికి కారణమైన అజ్ఞానాన్ని తొలగించే జ్ఞానం గనుక దీనిని ఉపనిషత్ అన్నారు.

చీకటి తొలగాలంటే దీపం కావాలి. అజ్ఞానమనే చీకటి తొలగాలంటే జ్ఞానమనే దీపం కావాలి. అట్టి జ్ఞాన జ్యోతిని శిష్యునికి అందించి ఉద్ధరించే మహాత్ముడే గురువు. 'గు' అంటే చీకటిని 'రు' అంటే పోగొట్టేవాడు. అజ్ఞానమనే చీకటిని పోగొట్టి జ్ఞానమనే దీపాన్ని వెలిగించే మహాత్ముడే గురువు.

నిజంగా జీవునికి పట్టిన ఈ అజ్ఞానం ప్రపంచజ్ఞానం – లౌకికజ్ఞానం లేకపోవటం వల్ల కలిగింది కాదు.

స్వస్వరూపజ్ఞానం – ఆత్మజ్ఞానం లేకపోవటం వల్ల కలిగిందే. కనుక ఆత్మజ్ఞానం వల్లనే అజ్ఞానం తొలగాలి. ఆ ఆత్మజ్ఞానం ఆచార్యుని బోధవల్లనే లభిస్తుంది.

శిష్టాచార సాంప్రదాయంలో బ్రహ్మవిద్య లేదా ఆత్మవిద్య గురుశిష్య పరంపరగానే వస్తుంది. ఉపనిషత్తులన్నీ అలాగే ఉంటాయి.

అయితే కొన్ని ఉపనిషత్తులలో గురువు పేరుగాని, శిష్యుని పేరుగాని ఉండకపోవచ్చు. కొన్నింటిలో ఉంటుంది. ఈశావాస్య, కేన ఉపనిషత్తులలో గురుశిష్యుల పేర్లు లేవు. కైవల్యోపనిషత్తులో గురువు బ్రహ్మదేవుడు. శిష్యుడు అశ్వలాయనుడు. కఠోపనిషత్తులో గురువు యమధర్మరాజు. శిష్యుడు నచికేతుడు. ముండకోపనిషత్తులో గురువు అంగిరసుడు. శిష్యుడు శౌనకుడు. ఇలా ఒక్కొక్క ఉపనిషత్తులో గురుశిష్యులు ఉన్నారు. ఒక్కొక్కదానిలో లేరు. అయినా ఉన్నట్లే భావించాలి. ఇప్పుడు మనం చెప్పుకోబోయే మాండూక్యోపనిషత్‌లో కూడా గురుశిష్యుల పేర్లు లేవు. గురుశిష్యుల పేర్లే కాదు గ్రంధకర్తల పేర్లు కూడా లేవు.

ఇలా ఉపనిషత్తులలో గురుశిష్యుల పేర్లు లేకపోవటం ఏమిటి? అసలు ఈ ఉపనిషత్తులకు గ్రంధకర్తల పేర్లు ఎందుకు లేవు?

## ఏమిటి కారణం?

మన ఉపనిషత్ ఋషులు ఏమాత్రం అహంకారం లేనివారు. భగవంతునికి సంపూర్ణ శరణాగతులై పరమాత్మను చేరుకున్నవారు. పరమాత్మను చేరుకున్నవారు తిరిగి వచ్చే ప్రశ్నేలేదు. అయినప్పటికీ స్వార్థం లేనివారై, సేవాసక్తితో, దివ్యభావంతో, త్యాగబుద్ధితో తమ తోటి మానవులను ప్రోత్సహించి, వారిని ఆ పరమాత్మ సన్నిధికి చేర్చుటకై, ఆత్మానుభూతిని కలిగించుటకై మార్గదర్శకులు కావాలనే సదుద్దేశంతో, ఎక్కడినుండో ఎగిరి వచ్చినట్లు ఈ లోకంలో కారణజన్ములుగా కనిపిస్తూ ఉంటారు.

అందుకే వారు వర్ణించవీలులేని, భాషకందని పరమాత్మను భాషద్వారానే వర్ణించి మార్గదర్శకులౌతున్నారు. అలా పరమాత్మ తత్త్వాన్ని తెలియజెప్పే ఉపనిషత్తులకు తామే కర్తలమని చెప్పుకోవటం కూడా మరచిపోయారు. అసలు కర్తృత్వం వారికి గిట్టదు. కనుకనే చాలా ఉపనిషత్తులకు కర్తలే లేరు.

కాని ఇంత విపులంగా బోధించిన ఈ ఉపనిషత్ పదాల వెనుక బ్రహ్మానందాన్ని స్వయంగా అనుభవించిన మహాత్ములున్నారని మాత్రం మనం గ్రహించాలి.

మనం ఏదైనా చిన్న పుస్తకం వ్రాసినా, నవలనో, కథనో, వ్యాసాన్నో వ్రాసినా దానిపై మన పేరును బిరుదులతో సహా ప్రచురించుకుంటాం. పదిమందికీ చెప్పి మన గొప్పతనాన్ని చాటుకుంటాం. కాని ఆ మహాత్ములు తమ అనుభవాలను ఉపనిషన్మంత్రాల ద్వారా ప్రకటిస్తూ కూడా తాము కర్తలమని చెప్పుకొనలేదంటే వారి అహంకార రాహిత్యం ఏమిటో మనకు తెలుస్తుంది. దీనిని బట్టి కూడా మనం తెలుసుకోవలసిన ముఖ్య విషయం ఒకటి ఉంది. అది – అహంకారాన్ని వదిలితేనే ఆత్మదర్శనం – అని

పాశ్చాత్యదేశాలలో వేదాంతగ్రంథాలు ధనసంపాదనకు, కీర్తి ప్రతిష్టలకు

ఉపయోగపడతాయి. కాని మనకు అలా కాదు. పాశ్చాత్యులకు వేదాంతం **ఆత్మతృప్తినిచ్చే సాధన** మాత్రమే. మనకు మాత్రం వేదాంతం **ఆత్మోద్ధరణకు సాధన.** మహాత్ములైన గురువుల వల్ల ఉపనిషత్ మంత్రాల అర్థాన్ని గ్రహించి శిష్యులు ఆత్మానుభూతిని పొంది పరమసత్యంలో స్థిరపడుతున్నారు. తిరిగి తమ వద్దకు వచ్చిన సాధకులకు తామే గురువులై, ఆ శిష్యులు దాన్ని తెలియజేస్తూ, ఈ జ్ఞానం అంతా గురుపరంపరగా వచ్చినదేగాని తాము స్వంతంగా కనిపెట్టినది కాదని చెబుతారు. అందుకే శాస్త్రగ్రంథాలన్నీ తమ పవిత్రతను నిలుపుకుంటున్నాయి. అందుకే గురుపరంపరగా అనంతకాలం నుండి ఈ ఉపనిషత్తులు నేటికీ కొనసాగుతున్నాయి. ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటాయి. ఇంతవరకు ఉపనిషత్తుల గురించి తెలుసుకున్నాం. ఇక ఇప్పుడు ప్రత్యేకంగా ఈ మాండూక్యోపనిషత్తు గురించి తెలుసుకుందాం.

## 4. మాండూక్యోపనిషత్తు

మొత్తం ఉపనిషత్తులు 1180 అని;

108 ఉపనిషత్తులు పేర్లు, మంత్రాలతో లభిస్తున్నాయని, అందులో దశోపనిషత్తులు ప్రధానమైనవని చెప్పుకున్నాం. ఆ దశోపనిషత్తులలో 6వ ఉపనిషత్తు ఈ మాండూక్యోపనిషత్తు. దశోపనిషత్తులలోనే కాదు మొత్తం 108 ఉపనిషత్తులలోను ఉత్తమోత్తమమైనది ఈ మాండూక్యోపనిషత్తు. ఈ విషయాన్ని డాండడడాండ డాండ నినదంబు లజాండమునిండ మత్త వేదండము నెక్కి చాట వచ్చును "ఈ మాండూక్యోపనిషత్తు ఉన్నతోన్నతమైనది, ఉత్తమోత్తమమైనది, ఉత్కృష్టమైనది, శ్రేష్టతమమైనది" – అని. ఎందుకంటే 108వ ఉపనిషత్తయిన ముక్తికోపనిషత్తులో శ్రీరాముడు ఆంజనేయునితో ఇలా అన్నాడు. **"మాండూక్యమేకమేవాలం ముముక్షూణాం విముక్తయే" – అని.** ఒక్క మాండూక్యోపనిషత్తును బాగా అధ్యయనం చేస్తే ఈ జన్మలోనే ముక్తి – కైవల్యముక్తి కలుగుతుంది– అని.

## ఇలా ఎందుకు చెప్పాడు?

ఆంజనేయుడు అడిగాడు. ఈ కైవల్యముక్తి ఏ ఉపాయం వల్ల సిద్ధిస్తుంది? అని. దానికి

**శ్రీరాముడు :** ఈజన్మలోనే మోక్షాన్ని – కైవల్యముక్తిని పొందాలంటే ఒక్క మాండూక్యోపనిషత్తును బాగా అధ్యయనం చేస్తే చాలు. అప్పటికీ సరైన ఆత్మజ్ఞానం కలగకపోతే దశోపనిషత్తులను తెలుసుకొని ఆచరణలో పెట్టుకో.

అప్పటికీ సరైన ఆత్మజ్ఞానం కలగకపోతే మొదటి 32 ఉపనిషత్తులను అధ్యయనం చేసి ఆచరణలో పెట్టుకో. ఇంకా దేహాభిమానం పోక, నిధిధ్యాసన కుదరకపోతే 108 ఉపనిషత్తులను అధ్యయనం చేసి ఆచరణలో పెట్టుకో, తప్పక నాలో ఐక్యమవుతావు – అని అన్నాడు.

దీనిని బట్టి అన్నింటికన్న మాండూక్యోపనిషత్తు ఉత్తమోత్తమం. దీనికీ పేరు ఎలా వచ్చింది?

కొన్ని ఉపనిషత్తులకు ఆ ఉపనిషత్తులోని మొదటి మంత్రంలో మొదటి పదమే ఆ ఉపనిషత్తు పేరుగా ఉన్నది.

**ఉదా :** ఈశావాస్య మిదగ్ం సర్వం ............. **ఈశ**

కేనేషితం పతతి ప్రేషితం ............ **కేన**

కొన్ని ఉపనిషత్తులకు మనమే ఏదో ఒక ఋషినామాన్ని అంటగడుతూ ఉంటాం.

**ఉదా :** కఠోపనిషత్తుకు – కాఠక ఋషి, అయితే వీటికి ఆధారాలు కనబడవు. మరి ఈ మాండూక్యోపనిషత్తుకు ఈపేరు ఎలా వచ్చింది? నిజంగా ఈ ఉపనిషత్తులో గురుశిష్యుల పేర్లు ఎక్కడా లేవు. అయినప్పటికి ఇది గురుశిష్య సంవాదరూపంలోనే ఉన్నదని చెప్పవచ్చు.

గురుఉవాచ, శిష్య ఉవాచ అని స్పష్టంగా లేకపోయినా గురుశిష్య సంవాదమును ఉదాత్త ధోరణిలో సూచించటం జరిగింది. గ్రంథకర్తగా

ఏఋషి పేరు లేదు ఈ ఉపనిషత్తులో. మరి మాండూక్యమనే ఈ పేరు ఎలా వచ్చింది? ఇంత గొప్ప సాహిత్యానికి గ్రంథకర్త లేకపోతే ఏం బాగుంటుంది? అనే దౌర్బల్యంతో కొందరు గ్రంధకర్తను కనుగొనుటకు ప్రయత్నించారు.

మధ్వాచార్యులు, అతని శిష్యులు శ్రీనివాస, వ్యాసతీర్థులు – అనే ఇద్దరు శిష్యులు ఈ ఉపనిషత్తులో ప్రథమాధ్యాయములోని గద్యరూపంలోని మంత్రాలు, పద్యరూపంలో ఉన్నకారికలు మొత్తాన్ని వరుణదేవుడు మండూక (కప్ప) రూపంలో ఉండి చెప్పినవి – అన్నారు. (మండూకం అంటే కప్ప). అందుకే మాండూక్య ఉపనిషత్ అనే పేరు వచ్చింది అన్నారు. ఈ మాట పౌరాణిక మనస్తత్వం గల వారికి రుచిస్తుంది గాని జిజ్ఞాసతో విశ్లేషణ చేసేవారికి నచ్చదు. జ్ఞానులకు నచ్చదు.

మరికొందరు ఏమంటారంటే ఈ ఉనిషత్తులోని విషయాలు ఒక క్రమ పద్ధతిలో లేవు. కప్ప గంతులు వేసినట్లుగ ఉన్నాయి. కనుక దీనికి మాండూక్యోపనిషత్తనే పేరు వచ్చింది – అంటారు. ఐతే పూర్తి అవగాహనతో గ్రంధాన్ని పరిశీలిస్తే అలా **కప్పగంతులు** ఏమీ లేవు. మొదటి 7 మంత్రాలు అవస్థాత్రయ విచారణ – చివరి 5 మంత్రాలు ఓంకారోపాసన చక్కగా ఉన్నాయి.

ఐతే కొందరు మహాత్ములు ఈ ఉపనిషత్తుకు ఈపేరు ఎలా వచ్చిందో ఒక అద్భుతమైన వివరణ ఇచ్చారు. ఈ వివరణ సత్యసాధకులను సరైన పద్ధతిలో నడపటానికి చక్కగా ఉపయోగపడుతుంది.

**అదేమిటో తెలుసుకుందాం**

సంస్కృతంలో మండూకం అంటే కప్ప. కనుక కప్ప స్వభావానికి సంబంధించిన శాస్త్రం ఇది – అంటారు. అయితే ఎన్నో జంతువులు ఉండగా కప్పనే ఎందుకు ఎంచుకున్నారు? – సాధారణంగా కప్ప 8, 9 నెలల పాటు నీటిలోనో, బురదలోనో, మురికి గుంటలలోనో, రాళ్ళ గుట్టల

మధ్యలోనో నివసిస్తుంది. అది అక్కడ ఎలా ఉంటుందంటే తపస్సు చేస్తున్నదా! అన్నట్లు నిశ్శబ్దంగా, ఏపనీ చేయకుండా (నిష్క్రియంగా) ఏమీ కోరకుండా (నిష్కామంగా) ఉంటుంది. ఇక వర్షాకాలం రావటంతో అది బయటకు వస్తుంది. అలా వచ్చి కన్నీరు కార్చే ప్రాణులను ఓదారుస్తున్నట్లుగా వర్షంలో మనోహరమైన ధ్వనితో బెకబెకలాడుతుంది.

నిజమైన మహాత్ములది కూడా ఇలాంటి స్వభావమే. జనసమ్మర్ధం లేకుండా ఉన్న హిమాలయ పర్వత సానువులలో ఏకాంత ప్రదేశాన్ని చూసుకొని ఏగుహలోనో – ఏ రహస్య ప్రదేశంలోనో వారు ధ్యానమగ్నులై ఆత్మానందాన్ని అనుభవిస్తూ ఉంటారు.

ఇలాంటి ఆత్మదృష్టిగల పరిపూర్ణ వ్యక్తులు ఆత్మయందే మనస్సు నిల్పి, ఆత్మలో రమిస్తూ, ఏ కోరికలూ లేకుండా (నిష్కామంగా), ఏ కర్మలూ చేయకుండా (నిష్క్రియంగా) కేవలం ఆత్మతో అనుసంధానమై, ఆత్మానుభూతిని పొందుతూ ఉంటారు. అంటే 8 నెలలు తపస్సులో – సమాధిలో ఉంటారు. ఇక వర్షాకాలంలో అనగా చాతుర్మాస్యంలో (ఆషాఢపూర్ణిమ మొదలు కార్తిక పూర్ణిమ వరకు) ధ్యాననిష్ఠను వదలి బాహ్య ప్రపంచంలోనికి వచ్చి, వారు ధ్యాననిష్ఠలో కనుగొన్న సత్యాన్ని, పొందిన అనుభూతిని బాహాటంగా గర్జిస్తారు. బోధ చేస్తారు. అయితే ప్రాపంచిక విషయ వ్యామోహంలో చిక్కియున్న సామాన్యులకు వారి వాక్కులు – బోధలు కప్పల బెకబెకలలాగా కఠినంగానే ఉంటాయి. ఎందుకు? –

ఎందుకంటే వారు కనుగొన్న సత్య విషయాలను, అనుభూతులను మనోహరంగా సున్నితంగా చెప్పటానికిగాని, మనస్సును కరిగించి ఆహ్లాదపరచే కవితాధోరణిలో చెప్పటానికిగాని ఆ మహర్షులకు కుదరదు. వారు తాము తెలుసుకున్న సత్య విషయాలకు ఏమాత్రం మెరుగులు దిద్దకుండా, శిల్పసౌందర్యం లేకుండా కుండబ్రద్దలు కొట్టినట్లు చెప్పటమే వారికి తెలుసు. అందుకే సున్నిత హృదయం గల వారికి వారి సత్యవాక్కులు కప్పల బెకబెకల లాగానే వినపడుతాయి.

సాధారణంగా భగవంతుని పట్ల భక్తిని ప్రబోధించే భక్తుల కథలు, భగవంతుని అనుగ్రహరూపకథలు ఎంతో సౌమ్యంగా ఆహ్లాదంగా ఉంటాయి.

ఐతే ఆత్మజ్ఞాన విషయాలను అలా చెప్పే వీలులేదు. వీపుపై కొరడాతో ఛెళ్ళున చరిచినట్లుగా చెప్పటానికే వీలుంటుంది. అలా చెబితేనే ప్రయోజనం. ఎందుకంటే ప్రాపంచిక వ్యామోహాలలో చిక్కి, పరమాత్మను మరచి జీవితాన్ని వ్యర్థం చేసుకొనే వారికి మెత్తని మాటలు పనికిరావు. వైరాగ్యం కలగాలన్నా – ఆత్మజ్ఞానం అవగతం కావాలన్నా అలా ఛెళ్ళుమనిపించాల్సిందే.

**అయితే అవి కప్పల బెకబెకలలాగా ఉన్నప్పటికీ – కన్నీరు కారుస్తున్నట్లున్న వర్షాకాలంలో, ఉరుములు రణగొణ ధ్వనుల మధ్యలో, భయంకర తుఫానులతో కూడిన జీవితంలో ఈ కప్పల బెకబెకలు – అంటే – మహాత్ముల యొక్క, మహర్షుల యొక్క జీవితసత్యాలు, వారి అనుభూతులు నిజంగా ఓదార్పునిచ్చి అత్యంతసుఖాన్ని కలిగిస్తాయి.**

ఈ ఉపనిషత్తులోని సత్యాలు అలా సూటిగా తెలుపబడ్డాయి కనుకనే కప్పల స్వభావమునకు సంబంధించిన శాస్త్రమే ఈ ఉపనిషత్తు అనటం జరిగింది. అందుకే దీనికి మాండూక్యోపనిషత్తు అని పేరు అని మహాత్ముల అభిప్రాయం. ఈ అభిప్రాయం చాలావరకు సమంజసంగానే ఉన్నది. ఈ ఉపనిషత్తును అధ్యయనం చేసే సాధకులకు తమ మనోబుద్ధులలోని మూఢత్వాన్ని తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. అంతేగాక ఈ ఉపనిషత్తులోని పదాలు, ప్రతిపాదనలు ఉద్రేకంతో గాని, హృదయంలో ఆర్ద్రత చేతగాని మధురంగా, సున్నితంగా, ఆహ్లాదకరంగా చేయబడినవి కావు అని ఈ మాండూక్యమనే పేరు తెలియజేస్తున్నది, హెచ్చరిస్తున్నది.

మెరుగులు, తళుకులు లేని ముడిసరుకులాగా, చెక్కడపు పనిలేని నగ్నసత్యాన్నే ఈ ఉపనిషత్తు ప్రకటిస్తున్నది. అందువల్ల ఈ ఉపనిషత్తు మన ప్రస్తుత ఊహలపైన, మన అజ్ఞానంపైన, మన తప్పుడు భావనలపైన

తిరుగుబాటు చేసేటట్లుగ మనబుద్ధిని తీర్చి దిద్దుతుంది అనటంలో సందేహం లేదు.

**– ఇక ఉపనిషత్తులోనికి ప్రవేశిద్దాం.**

**ప్రతి ఉపనిషత్తు శాంతిపాఠంతో ప్రారంభమవుతుంది. మనం కూడా శాంతిపాఠంతో ప్రారంభిద్దాం –**

శాంతి పాఠం

**ఓం భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః ।**
**భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రాః ।**
**స్థిరైరంగైః తుష్టువాం సస్తనూభిః ।**
**వ్యశేమ దేవహితం యదాయుః ।**
**స్వస్తిన ఇంద్రో వృద్ధశ్రవాః**
**స్వస్తినః పూషా విశ్వవేదాః**
**స్వస్తినస్తార్ క్ష్యో అరిష్టనేమిః**
**స్వస్తినో బృహస్పతి ర్దధాతు ।**

**ఓం శాంతిః శాంతిః శాంతిః ॥**

**ప్రతి ॥** ఓం = నిరాకార నిర్గుణ పరమాత్మ ; దేవాః = ఓదేవతలారా!; కర్ణేభిః = మా చెవులతో; భద్రం శ్రుణుయామ = మంగళకరమైన మాటలనే విందుముగాక!; యజత్రా = పూజనీయులైన దేవతలారా!; **అక్షభిః** = మాకళ్ళతో; **భద్రం పశ్యేమ** = మంగళకరమైన దృశ్యాలనే చూచెదముగాక; స్థిరైః; అంగైః = దృఢమైన అవయవాలతోను, **తనూభి;** = శరీరాలతోను, తుష్టువాంసః = గానం చేస్తూ (స్తుతిస్తూ); యదాయుః = ఆయుష్షు ఉన్నంతకాలం; దేవహితం = దైవకార్యాలను; వ్యశేమ = చేసెదము గాక!; వృద్ధశ్రవాః = సనాతన ఋషులచే స్తుతించబడిన; **ఇంద్రః** = ఇంద్రుడు;

మావద్ద లభించే అన్ని పుస్తకముల వివరముల కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :
http://www.srichalapathirao.com/catalog

"మాండూక్యోపనిషత్తు"గ్రంథంపై పూజ్య గురుదేవులు "శ్రీ దేవిశెట్టి చలపతిరావుగారు" చేసిన వ్యాఖ్య 150 పేజీలకు పైగా ఉన్న పుస్తకములు మా వద్ద లభించును

Ebooks మీరు DOWNLOAD చేసుకొనుటకు రూ.200/- లేదా పుస్తకమును మేము మీ ఇంటికి పంపాలంటే (courier ఖర్చులు అదనం కలిపి) ONLINE లో చెల్లించుటకు -

Click & Pay us through Paytm :
http://srichalapathirao.com/images/paytm_QR_WWWSRICHALAPATHIRAOCOM.png

లేదా

Pay us through Net Banking :
http://srichalapathirao.com/PDFs/Bank.pdf

మీకు మరేదైనా సందేహం ఉంటే care@srichalapathirao.com కు ఈమెయిల్ పంపగలరు లేదా +91 80085 39770 OR +91 95388 58115 నంబర్లకు ఫోన్ చేయగలరు

అన్ని పుస్తకములను లేదా కొన్ని పుస్తకములను లేదా గురుముఖతా ప్రవచనములను (వీడియో ప్రవచనముల కొరకు) శ్రవణం చేయుటకు DVD, External Hard Disk లేదా Audio CD, Pen Drive కొరకు ఈ క్రింది లింక్(URL) పై క్లిక్ చేయండి :
http://www.srichalapathirao.com/catalog